సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



పత్తి క్వింటాల్ ధర రూ.6,875

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో గురువారం పత్తి క్వింటాల్ గరిష్ట ధర రూ.6,875 పలికింది. కనిష్ట ధర రూ.5,701, నగటు ధర రూ.6,732గా నమోదైంది.



మూడోరోజు గంగాహారతి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురిలో మూడోరోజు గురువారం గంగాహారతి నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో దీపాలు వదిలారు.

గరిష్టం/కనిష్టం
33.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వందశాతం ఓటర్ స్లిప్‌లు అందజేయాలి



అవగాహన కార్యక్రమంలో ఆర్డీవో హనుమనాయక్, తదితరులు

రామగిరి(మంథని): అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా బీఎల్‌వోలు వంద శాతం ఓటర్ స్లిప్‌లు అందజేయాలని రిటర్నింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమనాయక్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓటర్ స్లిప్‌లతో పాటు ఓటర్ గైడ్, సీ విజిల్ కరపత్రాలను ప్రతీ ఓటర్‌కు అందించాలని సూచించారు. ఈ నెల30న జరిగే ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పారదర్శకంగా ఓటు వేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరికీ సీ విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950పై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామగిరి, కమాన్‌పూర్ తహసీల్దార్లు రాంచందర్‌రావు, మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీపీ-2లో ఈపీ ఫిట్టర్‌కు గాయాలు



గాయపడిన హఫీజొద్దీన్

రామగిరి(మంథని): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో ప్రమాదం జరిగింది. విధులు నిర్వహిస్తున్న ఈపీ ఫిట్టర్ హఫీజొద్దీన్ గాయపడ్డాడు. విధుల్లో భాగంగా గురువారం డంపర్‌కు మరమ్మతులు జరుగుతుండగా ప్రమాదం జరిగింది. హఫీజొద్దీన్ కుడి కాలుకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక డిస్పెన్సరీకి తరలించగా మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో అంతర్గాం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ మండలాల నుంచి ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో అంతర్గాం- కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. అంతర్గాం జట్టు రన్నర్‌గా నిలిచింది. పోటీలకు ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి హాజరుకాగా, నిర్వాహకులు గణపతి, కోల సంతోష్‌గౌడ్, అంగోతు శ్రీనివాస్, వెంకట్రావు, శ్రీనివాస్, రాము, కృష్ణమూర్తి, నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూ కళాశాలలో మెకానికల్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అఖిల్ తేజ రాసిన షాడోస్ ఆఫ్ ది హంగ్రీ నైట్ అనే పుస్తకాన్ని గురువారం ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ ప్రచురణకర్త నోషన్ ప్రెస్ సంస్థ పుస్తకాన్ని ముద్రించింది. తనకు వచ్చిన కల ఆధారంగా పుస్తకాన్ని రాయడం జరిగిందని అఖిల్‌తేజ తెలిపారు. కళాశాలకు చెందిన అధ్యాపకుడు ఎస్‌ఎస్‌ఆర్ కృష్ణ ప్రోత్సాహంతో పుస్తకం రాశానని, 120 రూపాయలతో అన్ని ఆన్‌లైన్ స్టోర్‌లలో లభ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా మూఢనమ్మకాల అసమానతలపై పుస్తకాన్ని రాసిన అఖిల్‌తేజను టీచింగ్ సిబ్బంది, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రామగిరి(మంథని): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిల్లా ఆధ్వర్యంలో వేరుశెనగ పంటపై అవగాహన, విత్తన పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నూనె గింజల పంటల ప్రాముఖ్యం, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా.కిరణ్, డా.భాస్కర్‌రావు, డా.వినోద్‌కుమార్, కల్వచర్ల, పెంచికల్‌పేట, బ్రహ్మణపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహిళ ఓట్లే టార్గెట్

- జిల్లాలోని మూడు సెగ్మెంట్లలో వారే అధికం
- అతివల ఓట్ల కోసం అభ్యర్థుల పాట్లు
- మహిళ సంఘాలతో ప్రత్యేక భేటీలకు ప్రణాళికలు



సాక్షి,పెద్దపల్లి: అన్ని రంగాల్లోనూ అతివలు ముందంజ వేస్తున్న కాలమిది. చట్టసభలకు ఎవరు వెళ్లేది నిర్ణయించే విషయంలో కూడా వీరే ముందంజలో ఉన్నారు. జిల్లాలో ఇది అక్షర సత్యమవుతోంది. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. దీనికి తగ్గట్టు గతంలో జరిగిన ఎన్నికల్లో సైతం పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లే తమ ఓటు హక్కును అధికంగా వినియోగించుకున్నారు. దీంతో అభ్యర్థులు అందరూ ఇప్పుడు మహిళల ఓట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వారి ప్రసన్నం కోసం..

నామినేషన్ల ప్రక్రియ ముగిసి, అభ్యర్థుల గుర్తుల కేటాయింపులు ముగియడంతో అభ్యర్థులు ప్రచారం హోరు పెంచారు. దీంతో అభ్యర్థులు ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ, ఇంట్లో ఉండే మహిళలను పరిచయం చేసుకుంటూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుంటూ, గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. గ్రామాల్లో ఉండే మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తూ, వ్యక్తిగతంగా ఓటర్లను ఆకర్షించడానికి బదులుగా సంఘటింతంగా ఉన్న మహిళా సంఘాలపైనే అభ్యర్థులు దృష్టి పెడుతున్నారు. ప్రతీ గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల ఓట్లు అధికంగా ఉన్నాయి. వారిని తమ వైపు తిప్పుకోవడానికి బరిలోని అభ్యర్థులు తమదైన తీరులో ప్రచారం చేస్తున్నారు. గ్రామాలవారీగా మహిళా సంఘాలతో ప్రత్యేకంగా భేటీ అవుతూ.. వారికి కావలసిన తాయిలాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే డీజే బాక్సులు, గోడ గడియారాలతో తాయిలాలు ఎర వేస్తు న్నా నాయకులు.. తదుపరి టార్గెట్‌గా మహిళ ఓటర్లను ఆకట్టుకోవటానికి చీరలు, కుంకుమ భరిణె తాయిలాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. సంఘాల ఖాతాల్లో నేరుగా డబ్బు జమచేస్తే ఎన్నికల సంఘం గుర్తించే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలంటే క్లిష్టతరంగా ఉండటంతో, సంఘాల లెక్కపద్దులను చూసే ఆర్పీలు, వీవోఏల ఖాతాల్లో జమచేసి పంపిణీ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వారే అధికం..

జిల్లాలో మొత్తం 7,12,359 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళ ఓటర్లు 3,57,737 మంది ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో సైతం మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. కాగా జిల్లాలో స్వయం సహాయక సంఘాలు 7,438 ఉండగా, గ్రామ సంఘాలు 452 ఉన్నాయి. వాటిలో 1,14,030 మంది సభ్యులు ఉన్నారు.

జాబితాలో సవరణలేవి..?

- ఓటరు జాబితాలో బోలెడు తప్పులు
- మృతుల పేర్లు తొలగించలే
- ఒక్కో ఓటరు పేరు రెండేసి సార్లు
- ఇంటి నంబరు అంటే 'హౌజ్' అట..!


పెద్దపల్లిరూరల్: అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓటరు జాబితాలో అనేక పొరపాట్లు కనిపిస్తున్నాయి. పెద్దపల్లిలోని 60వ నంబరు పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తే అనేక పొరపాట్లు వెలుగుచూశాయి. ఇక నియోజకవర్గం, జిల్లా జాబితాలో ఎన్నెన్ని పొరపాట్లు జరిగాయో..ఏమో..!

'డబుల్' ఓటరు..



ఒకే వ్యక్తి పేరిట ఓటరు జాబితాలో రెండు సార్లు పేరు నమోదైంది. మొహినుద్దీన్ షేక్ (zzv1863182) షేక్ మొహినుద్దీన్ (zzv1879840) అంటూ వరస సంఖ్యలో ఓటరు జాబితాలో పేరు నమోదై ఉంది. ఇలాంటి పొరపాట్లు ఇంకా దొర్లినట్లు తెలుస్తోంది.

రకరకాల తప్పులు



ఓటరు జాబితాలో రకరకాల తప్పులు దొర్లినట్లు కనిపిస్తున్నాయి. నవీన్ విజయగిరి అనే ఓటరు పేరు నమోదైన కార్డుపై ఇంటి నంబరు వద్ద హౌజ్ అని రాసి ఉంది. హౌజ్ అంటే ఏ ఇంటి నంబరులో నివసిస్తున్నట్లో మరి..!

జాబితాలో మృతుల పేర్లు పదిలం



మృతిచెందిన వారి పేర్లు ఇప్పటికీ ఓటరు జాబితాలో పదిలంగానే కనిపిస్తున్నాయి. ఒక్కో బూత్ పరిధిలో కనీసం 10 నుంచి 20 మంది వరకు మరణించిన వారిపేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారి పేర్లను తొలగించేందుకు కుటుంబీకులే ఫారం 7 నింపి అందిస్తే బీఎల్‌వోలు తొలగిస్తారని ఓ అధికారి తెలిపారు. వాళ్లు చనిపోయారనే విషయాన్ని బీఎల్‌వోలు, ఎన్నికలకు సంబంధించిన అధికారులు నిర్ధారించుకోలేక తొలగించకపోవచ్చని సదరు అధికారి పేర్కొన్నారు.

ఒకే ఇంటినంబరుపై 17మంది పేర్లు.!



పెద్దపల్లి పట్టణంలోని పోలింగ్ బూత్‌నంబరు 60 పరిధిలోని ఇంటినంబరు 4-4-40లో ఏకంగా 17మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఒకే ఇంటినంబరులో ఇంత మంది ఓటర్ల పేర్లు నమోదై ఉండగా.. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

కుటుంబం ఒక్కటే.. కేంద్రాలు వేరు..

ఒక కుటుంబానికి ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల అధికారులు పదే పదే పేర్కొంటున్నా సంబంధిత యంత్రాంగం అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్టు కనిపించడం లేదు. సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన కండె సారయ్య కుటుంబీకులు మూడు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. సారయ్య కుమారులు సిద్దార్థ, యశ్వంత్‌కు 59వ నంబరు పోలింగ్ బూత్ కేటాయించగా, సారయ్యకు 60వ నంబరు కేంద్రం, అతడి భార్య లతకు 61వ నంబరు కేంద్రంలో ఓటు వేసుకునే అవకాశం కల్పించారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

- రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

గోదావరిఖని(రామగుండం): ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో తనిఖీలు కట్టుదిట్టం చేయాలని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ ఆదేశించారు. గురువారం ఫ్లయింగ్‌స్క్వాడ్ (ఎఫ్‌ఎస్‌టీ), స్టాటిటిక్స్ సర్వేలైన్స్, (ఎస్‌ఎస్‌టీ), వీడియో సర్వేలైన్స్(వీఎస్‌టీ) బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాల తనిఖీ, జప్తులపై పలు సూచనలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించాలని, తనిఖీ సమయంలో నగదు, మద్యం, రాజకీయపార్టీల ఉచితాలు, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. నగదుకు సంబంధించి రూ.50వేల కంటే ఎక్కువ రూ.10 లక్షలవరకు రసీదులు చూపించాలని, రూ.10 లక్షలు దాటితే సంబంధిత రసీదులు ఉన్నప్పటికి నగదు, వాహనాన్ని జప్తు చేయాలని ఆదేశించారు. మద్యం, బంగారం, తదితర వస్తువుల విలువ రూ.50వేల వరకు ఉంటే ఎలాంటి జప్తు అవసరం లేదని, రూ.50 వేలకు మించి రూ.10లక్షల లోపు ఉంటే అనుమతులు చూపించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదులు, అనుమతులు, సమాచారానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 1950 టోల్ ఫ్రీ నంబర్, రామగుండం కంట్రోల్ రూం 18004256521 నంబర్ అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో సహాయ వ్యయ పరిశీలకుడు అశోక్‌కుమార్, కంట్రోల్‌రూం నోడల్ అధికారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు



అవగాహన కల్పిస్తున్న శంకర్

కోల్‌సిటీ(రామగుండం): ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత ఈదునూరి శంకర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో గురువారం యువ ఓటరు- ఓటు హక్కు ప్రాధాన్యతపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరికి ఓటు వజ్రాయుధమని, ప్రస్తుత ఎన్నికల సమయంలో ప్రతి పౌరుడి ఓటు ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఎంతో పవిత్రమైనదిగా భావించాలని కోరారు. ఓటు హక్కు పౌరుడి అస్తిత్వానికి ప్రతీకని, ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉందన్నారు. కానీ చాలా మంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యువ ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. లైబ్రేరియన్ ఎం.భారతిరెడ్డి, యువమిత్ర సేవా సమితి నాయకులు పూట్ల సురేశ్, ప్రసాద్, రాజు, రవళి, కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



గోదావరిఖని బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం బస్టాండ్, రైల్వే స్టేషన్, లాడ్జీలు, బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్నికలు ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో..

రామగుండం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం రామగుండం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన చెత్త నిర్వహణ

- రామగుండం బల్దియాకు డంపింగ్‌యార్డు కష్టాలు
- ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే డంపింగ్
- పట్టించుకోని పాలకులు, జిల్లా యంత్రాంగం
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో వెలుగుచూసిన సమస్య



తాజాగా ఫిల్టర్‌బెడ్ సమీపంలో చెత్తను పోస్తున్న బల్దియా



మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు

బల్దియా వైశాల్యం: 93.87 చదరపు కిలోమీటర్లు
జనాభా: 2,29,644 (2011 జనాభా లెక్కలప్రకారం)
మొత్తం నివాసాలు: 63,000
పారిశుధ్య కార్మికులు: 448 మంది
పర్యవేక్షకులు/సహాయకులు: 24 మంది
రోజూ వెలువడే చెత్త: 200 మెట్రిక్ టన్నులు
చెత్త సేకరణకు ఆటో ట్రాలీలు: 50

కోల్‌సిటీ(రామగుండం): చెత్తసేకరణలో ఒకప్పుడు దేశంలో రామగుండం బల్దియా ఆదర్శంగా నిలిచింది. కీలకమైన డంపింగ్‌యార్డుకు ఇప్పటి వరకు స్థలం లేకపోవడంతో చెత్త నిర్వహణ అటకెక్కింది. రోజూ సేకరించిన వందలాది మెట్రిక్ టన్నుల చెత్తను ఎక్కడపోయాలో తెలియక అధికారులు తల పట్టుకుంటున్నారు. మొన్నటి వరకు గోదావరి ఒడ్డున సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా ఉపయోగించారు. నగర ప్రజలతోపాటు జాతర కమిటీ నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం కావడంతో, గోదావరి ఫిల్టర్ బెడ్ సమీపంలోని ఖాళీ స్థలంలో చెత్తను పోస్తున్నారు.

రోజుకు 200 మెట్రిక్ టన్నులు..

రామగుండం నగరపాలక సంస్థలోని 50 డివిజన్ల నుంచి సుమారు 150 మెట్రిక్ టన్నుల వరకు రోజూ చెత్త వెలువడుతోంది. అలాగే బల్దియా పరిధిలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్‌కో పరిశ్రమల కాలనీల నుంచి సుమారు 50 మెట్రిక్ టన్నులు వెలువడుతోంది. ఈచెత్తనంతా డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ స్థలం లేకపోవడంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్తను పారపోస్తున్నారు.

ఓసీపీ-4 దగ్గర తేలని ప్రతిపాదన

కొన్నేళ్ల క్రితం యైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని జల్లారం శివారులో సింగరేణి సంస్థ సుమారు 10 ఎకరాల స్థలాన్ని రామగుండం బల్దియాకు కేటాయించింది. కాగా ఆ స్థలంలో ఓసీపీ-5 ప్రాజెక్ట్ ఏర్పాటుతో డంపింగ్‌యార్డ్‌కు కేటాయించిన స్థలాన్ని తిరిగి సింగరేణి స్వాధీనం చేసుకుంది.

ముందుకు రాని పరిశ్రమలు

వివిధ పరిశ్రమల నిలయంతో మాంచెస్టర్ ఇండియాగా పేరుగాంచిన రామగుండంలో డంపింగ్ యార్డుకు స్థలం లభించని దుస్థితి. వేలాది ఎకరాల ఖాళీ స్థలాలు కలిగిన ప్రభుత్వరంగ పరిశ్రమలు కేటాయించడానికి ముందుకు రావడం లేదు. స్థల సేకరణపై పాలకవర్గం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కాగితాల్లోనే తడి, పొడి..

తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ రామగుండంలో కాగితాలకే పరిమితం అవుతోంది. గౌతమినగర్‌లో మాత్రమే పొడి చెత్త నిర్వహణ చేపడుతున్న అధికారులు, తడి చెత్తపై చేతులెత్తేశారు. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు గౌతమినగర్, ఎన్టీఆర్‌నగర్, జ్యోతినగర్‌లో ప్రత్యేక షెడ్లు నిర్మించినా వినియోగానికి నోచుకోవడం లేదు.

డంపింగ్‌యార్డు కోసం ప్రయత్నాలు



డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. కలెక్టర్ జోక్యంతో క్షేత్రస్థాయిలో సింగరేణి అధికారులతో సమీక్షలు జరిపి కొన్ని ప్రాంతాలను పరిశీలించాం. ఎన్నికల తర్వాత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.నాగేశ్వర్, మున్సిపల్ కమిషనర్

డంపింగ్‌యార్డు లేకపోవడం సిగ్గుచేటు



రామగుండం కార్పొరేషన్‌కు డంపింగ్‌యార్డు లేకపోవడం సిగ్గుచేటు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్‌కో పరిశ్రమలు కూడా ప్రజాసొకర్యార్థం కనీసం 20 ఎకరాలు కేటాయించకపోవడం దుర్మార్గం. పాలకవర్గం, అధికారులు స్పందించి డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

– మద్దెల దినేశ్, సామాజికవేత్త, గోదావరిఖని

చెత్త కుప్పలతో దుర్వాసన



గోదావరిఖని మార్కండేయకాలనీలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. స్టార్ మౌంట్ ఆస్పత్రి పక్కన, రెయిన్‌బో స్కూల్ సమీపంలో చెత్త కుప్పలుగా ఉంటున్నాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వైకుంఠం, గోదావరిఖని

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సికింద్రాబాద్‌లో ఈనెల 13 నుంచి 16వరకు జరిగిన 10వ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాలికల విభాగంలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. సీహెచ్.ఖుషి, ప్రియదర్శిని, పునీత, సంధ్య అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి– రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రైలుకింద పడి గుర్తుతెలియని (సుమారు 55 ఏళ్లు) వ్యక్తి మృతిచెందాడు. మృతుడి ఒంటిపై లైట్‌కలర్ నీలిరంగు ఫుల్‌చొక్కా, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. రైలులో ప్రయాణిస్తు జారి పడ్డాడా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం తేలాల్సి ఉందని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చినట్లు, ఆచూకీ తెలిసిన వారు 99493 04574, 87126 58604 నంబర్లలో సమాచారం అందించాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కనగర్తి వద్ద గురువారం ఆటోరిక్షాలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని కాపులపల్లి గ్రామానికి చెందిన సందనవేని రమేశ్ ఆటోలో 96మద్యం క్వార్టర్ సీసాలను తరలిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. రమేశ్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తిస్తే తమ 87126 58817 నంబర్‌కు సమాచారమందించాలని కోరారు. సిబ్బంది కార్తీక్‌రెడ్డి, శరత్‌బాబు, కృష్ణ, సంతోష్ ఉన్నారు.

80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం నామాపూర్‌తండా, గోపాల్‌పల్లె, ఇందిరమ్మ కాలనీల్లో గురువారం దాడులు నిర్వహించి 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకంను ధ్వంసం చేసి 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధ్యులైన భూక్య లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై శైలజ, శంకర్, సుమన్, రాకేశ్, రాజు తదితరులు పాల్గొన్నారన్నారు.

నల్లకోటు వీడి.. చట్టసభల్లోకి



ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికైన న్యాయవాదులు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 మంది
- వీరిలో పలువురిని వరించిన మంత్రి పదవి
- భారత ప్రధాని పీవీ నర్సింహారావు లాయరే..
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కూడా..



పీవీ నర్సింహారావు, శ్రీపాదరావు, టి.జీవన్‌రెడ్డి, వినోద్‌కుమార్, విద్యాసాగర్‌రావు, ప్రభాకర్‌గౌడ్, ఆరెపల్లి మోహన్



రాజేశంగౌడ్, ఎమ్మెస్సార్, బొమ్మ వెంకన్న, మృత్యుంజయం, సి.ఆనందరావు, రాజేశ్వర్‌రావు, డి.శ్రీధర్‌బాబు

సిరిసిల్ల: న్యాయశాస్త్రం చదువుకున్న పలువురు న్యాయవాద వృత్తిని వీడి, చట్టసభల్లో అడుగుపెట్టారు. రాజకీయాల్లో అతిరథమహారథులుగా పేరొందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు వకీళ్లుగా కోర్టుల్లో నల్లకోటు వేసినవారే. భారత ప్రధానిగా సేవలందించిన బహుభాషావేత్త పీవీ నర్సింహరావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు కూడా న్యాయవాదులే. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏకంగా 30 మంది ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వకీల్‌గా జీవితాన్ని ప్రారంభించి, ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారిపై కథనం.

తొలి ఎన్నికల్లోనే..

ఉమ్మడి జిల్లాలో 1952లో తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఏలేటి రాజిరెడ్డి సుల్తానాబాద్ నుంచి విజయం సాధించారు. మంథని నుంచి సోషలిస్టు అభ్యర్థి గుల్లకోట శ్రీరాములు, సిరిసిల్ల నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) గెలిచారు. 1957లో సుల్తానాబాద్ నుంచి పి.రామచంద్రారావు(పీడీఎఫ్), చొప్పదండి నుంచి చెన్నమనేని రాజేశ్వర్‌రావు(పీడీఎఫ్), మెట్‌పల్లి నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) ఎన్నికయ్యారు. 1957లోనే మంథని నుంచి గెలిచిన పీవీ నర్సింహారావు మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన సేవలందించారు. హైదరాబాద్‌లో ఆయన మొదట్లో న్యాయవాదిగా ఉన్నారు.

రాష్ట్ర మంత్రులైనవారు వీరే..

న్యాయవాదిగా పని చేసిన పలువురు ఎమ్మెల్యేలుగా గెలిచి, రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. కరీంనగర్ నుంచి ఎన్నికైన చల్మెడ ఆనందరావు ఎన్టీఆర్ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు. జగిత్యాల నుంచి గెలిచిన జి.రాజేశంగౌడ్, 1987లో ఎమ్మెల్యే అయిన టి.జీవన్‌రెడ్డి, 2004లో కరీంనగర్ నుంచి గెలిచిన ఎం.సత్యనారాయణరావు, మంథని ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మంత్రి పదవి వరించింది.

1985లో మెట్‌పల్లి నుంచి విజయం సాధించిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు న్యాయవాద వృత్తి చేపట్టినవారే. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేశారు.

స్పీకర్‌గా శ్రీపాదరావు..

న్యాయవాద వృత్తి నుంచి వచ్చినవారిలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రముఖుడు. 1983, 1985, 1989 ఎన్నికల్లో గెలిచిన ఆయన శాసనసభ స్పీకర్‌గా ఎక్కువ కాలం పని చేశారు. ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు కూడా లాయరే. 1999, 2004, 2009, 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగానూ సేవలందించారు.

జంగ్ తెలంగాణ

మరికొందరు..

1963లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన కాసుగంటి లక్ష్మీనర్సింహారావు న్యాయవాదిగా పని చేశారు. 1967 ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికై, రికార్డు సృష్టించారు. 1985లో నేరెళ్ల నుంచి గెలిచిన ఉప్పరి సాంబయ్య, 1983లో కరీంనగర్ స్థానం నుంచి సంజయ్ విచార్‌మంచ్ అభ్యర్థిగా గెలిచిన కటకం మృత్యుంజయం, 1989లో హుజూరాబాద్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన కె.సాయిరెడ్డి, 1994లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇందుర్తిలో విజయం సాధించిన బొమ్మ వెంకటేశ్వర్లు, 1999లో మెట్‌పల్లి నుంచి గెలిచిన కొమొరెడ్డి జ్యోతి, 2004లో ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, 2009లో మానకొండూరు నుంచి గెలిచిన ఆరెపల్లి మోహన్, 2009లో కరీంనగర్ నుంచి ఎంపీగా విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు న్యాయశాస్త్రం చదివినవారే కావడం విశేషం. నల్లకోటు వీడి ఎన్నికల బరిలో నిలిచిన పలువురు విజయం సాధించగా ఎంతోమంది న్యాయవాదులు ఓటమిపాలయ్యారు. చట్టసభల్లో సక్సెస్ అయిన నేతలెందరో ఉమ్మడి జిల్లాకు మంచిపేరు తీసుకువచ్చారు.

రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం

- సోషల్ మీడియాలో వైరల్



రేషన్ బియ్యం



రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం

ముత్తారం(మంథని): ముత్తారం మండలం మచ్చుపేటలో రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కనబడటం గురువారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన తాళ్లపల్లి సతీశ్ రేషన్ బియ్యాన్ని పిండి పట్టిద్దామని పరిశీలించగా ప్లాస్టిక్ బియ్యం గింజలు బయటపడ్డాయి. గ్రామంలోని రేషన్ దుకాణంలో తీసుకువచ్చిన బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయని జాగ్రత్త అని సోషల్ మీడియాలో స్థానికులు పోస్టు పెట్టారు. ప్లాస్టిక్ బియ్యం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయమైంది. ప్లాస్టిక్ బియ్యంపై అధికారులు విచారణ చేపట్టి నిజాలు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

టెంట్ కింద చదువులు.. విద్యార్థులకు ఇబ్బందులు

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం ఏర్పాటుతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుంది. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో రామగుండం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పలు తరగతి గదులు, హాలును ఎన్నికల అధికారుల కార్యాలయాలు, స్ట్రాంగ్ రూం తదితర వాటికోసం తీసుకున్నారు. విద్యార్థులకు ఖాళీ స్థలంలో టెంట్‌లు వేసి తరగతులు కొనసాగిస్తున్నారు. టెంట్ కింద పరదాలతో తరగతి గదులను విభజించగా విద్యార్థులకు పక్క తరగతిలో చెప్పే పాఠాలు వినిపించడం, బోర్డు సదుపాయాలు లేకపోక చదువుకు ఆటంకం కలుగుతుంది. ఎన్నికలు ఇంకా 14 రోజులు ఉండడం, ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ పాయింట్,



టెంట్ కింద తరగతుల్లో విద్యార్థులు

సిబ్బంది కేటాయింపు, పోలింగ్ మెటీరియల్ అందజేత కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియతో విద్యార్థుల చదువులకు మరింత ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారి చదువుకు ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గోడ గడియారాల పట్టివేత

మంథని: మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫొటోతో ఉన్న గోడ గడియారాలను తరలిస్తున్న డీసీఎంను ఎఫ్ఎస్‌టీ బృందం అధికారులు పట్టుకున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంథనిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో నలుగురు సభ్యులతో కూడిన అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో శ్రీధర్‌బాబు ఫొటోతో ముద్రించి ఉన్న వాచ్‌లను గుర్తించారు. వ్యాన్‌లో 5,368 గోడ గడియారాలు ఉండగా వాటి విలువ సుమారు రూ.1,96,000 వరకు ఉంటుందని మంథని రిటర్నింగ్ అధికారి హనుమ నాయక్ తెలిపారు. డీసీఎంను పట్టుకున్న విషయాన్ని ఎఫ్ఎస్‌టీ అధికారులు రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ తరలించారు. ఫిర్యాదు మేరకు గోడ గడియారాలు తరలిస్తున్న డ్రైవర్ అనంతుల రమేశ్‌పై కేసు నమోదు చేయడంతో



పట్టుబడిన వ్యాన్

పాటు వ్యాన్, గోడ గడియారాలను అధికారులు సీజ్ చేశారు. గడియారాలను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి మంథని నియోజకవర్గంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా తరలిస్తున్నరు.

మాయమైండు..శవమై దొరికిండు

- పీహెచ్‌సీ ఎదుట కాలువలో మృతదేహం లభ్యం



అజయ్ (ఫైల్)

రామగుండం: అబాది రామగుండంకు చెందిన మాచర్ల అజయ్(28) ఈనెల 14న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో అదే రోజు రామగుండం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. మూడు రోజులుగా సమీప కాలనీల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట కాలువ సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటస్వామి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో బయటకు తీసి పరిశీలించి మిస్సింగ్ కేసు నమోదైన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత మృతికిగల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. ఆ దిశగా మృతిపై దర్యాప్తు చేపడతామని వివరించారు. మృతుడికి ఒక సోదరి ఉండగా తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడతామని ఎస్సై తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా ఆభరణాలు చోరీ

జగిత్యాల రూరల్: ఓ ప్రయాణికుడి వద్ద ఉన్న ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వంజరివాడకు చెందిన రమణయ్య బుధవారం తన కుటుంబసభ్యులతో కలిసి నిజామాబాద్ వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండ్‌కు వెళ్లాడు. ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా దొంగలు రూ.2.80 లక్షల విలువైన ఆభరణాలున్న ఆయన బ్యాగును చోరీ చేశారు. బాధితుడు గురువారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు.

కోటి శైవక్షేత్రాల ఫలం.. ‘బ్రహ్మసూత్ర’ దర్శనం

- నాలుగేళ్ల క్రితం వెలుగుచూసిన బ్రహ్మసూత్ర శివలింగం
- కార్తీకమాసంలో క్రమంగా పెరుగుతున్న భక్తుల రద్దీ



శ్రీకాశీవిశ్వేశ్వరాలయం



పూజలు చేస్తున్న భక్తులు

రామగుండం: దేశవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో బ్రహ్మసూత్ర శివాలయాలు అరుదుగా ఉంటాయి. తెలంగాణలో నల్గొండ జిల్లా శంకరపల్లిలోని మరకత శివలింగంపై కూడా బ్రహ్మసూత్రం (లింగంపై గీతలు) ఉండగా, రెండో పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ అబాది రామగుండంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఉంది. దీనికి గడీల గుడిగానే భక్తులకు సుపరిచితం. ఈ ఆలయానికి రెండునెలల క్రితం మౌళిక సదుపాయాలు కల్పించడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. కాగా ఏటా శ్రావణం, కార్తీక మాసాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పక్కన ఉన్న కాకానిక్షేత్రం, కోటప్పకొండపై త్రికోటేశ్వరలింగం శైవక్షేత్రాల్లో బ్రహ్మసూత్రం ఉన్న శివలింగాలున్నాయి.

ఆలయ స్థల పురాణం

కాకతీయులకాలంలో ప్రస్తుత ఆలయం పక్కనే రాజుల గడి ఉన్నట్లు ఆనవాళ్లున్నాయి. అందులో నీటి కొలను, బావి, రాతి ద్వారాలు, శివలింగం, అన్నపూర్ణదేవి, విఘ్నేశ్వరుడు, నందీశ్వరుడు, నాగదేవత ఆలయాల సమూహం ఉండేదని చరిత్ర. కాలక్రమంలో ఆలయాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాగా శివలింగం, విఘ్నేశ్వరుడు, అన్నపూర్ణదేవి రాతి విగ్రహాలు కొంతమేర మట్టి దిబ్బల్లో కనిపించడంతో గ్రామస్తులు వాటిని వెలికితీసి నిత్య పూజలు చేయడం మొదలుపెట్టారు.

నాలుగేళ్ల క్రితం గుర్తింపు

2019లో పలువురు భక్తులు దర్శనం చేసుకునే క్రమంలో శివలింగంపై గీతలు ఉండడాన్ని గుర్తించి ఆరా తీశారు. వాటినే బ్రహ్మసూత్ర శివలింగంగా గుర్తించారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చాగంటి కోటేశ్వరరావు బ్రహ్మసూత్ర శివలింగం ప్రాధాన్యం తెలుపుతూ అబాది రామగుండం పేరును ఉచ్చరించడంతో విశిష్ట గుర్తింపు వచ్చింది. దీంతో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకొని పునీతులవుతున్నారు.

కోటి జన్మల ఫలం



అబాది రామగుండంలో బ్రహ్మసూత్ర శివలింగం ప్రాధాన్యత తెలిసి కార్తీకమాసంలో పూజలు చేసుకుంటే విశేష మోక్షం కలుగుతుందని భావించి హైదరాబాద్ నుంచి వచ్చా. పూజానంతరం మనసు ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది.

– కోలహాలం రమేశ్, పురోహితుడు, హైదరాబాద్

తొలిసారి దర్శనం చేసుకున్నా



నేను మంచిర్యాల కేంద్రంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ పూజారిని. నాకు ఇటీవలే బ్రహ్మసూత్ర శివలింగం ఉందని తెలిసి కార్తీకమాసం తొలి సోమవారం సూర్యోదయానికి ముందు దర్శనం చేసుకోవాలని తలంచి నేనే శివలింగానికి అభిషేకం చేసుకున్నా.

– గంగారపు రామమూర్తిశర్మ, మంచిర్యాల

మహిమాన్విత శక్తి..



తెలంగాణలో బ్రహ్మసూత్ర శివలింగాలు అరుదు. ఇంతటి మహిమాన్విత శక్తి ఉన్న శివలింగాన్ని దర్శించుకున్న తర్వాత మనసుకు ఎంతో ఆహ్లాదమనిపించింది. ప్రతి ఒక్కరూ దర్శించుకోవాలని కోరుతున్నా.

– గంగారపు వెంకటరమణశర్మ, పూజారి, మంచిర్యాల

కలలో కూడా ఊహించలేదు



రాతి విగ్రహాలు పూజలు అందుకోక తుమ్మపొదల్లో నిర్లక్ష్యంగా పడి ఉండడం నా మనసుకు నచ్చలేదు. స్థానిక యువకుల సహకారంతో శిథిలావస్థకు చేరిన విగ్రహాలను తీసి చిన్న ఆలయంగా తీర్చిదిద్దాలనుకొని పని పూర్తి చేశా. కాలక్రమేణా సదరు శివలింగంపై చారలు (గీతలు) ఉండడంతో అతి పవిత్రమైన బ్రహ్మసూత్ర లింగంగా వెలుగులోకి వచ్చింది. ఇలాంటి శివలింగానికి పూజ చేసుకునే భాగ్యం రావడం ఏ జన్మలో చేసిన పుణ్యఫలమోనని ఆనందంగా ఉంది.

– బుగ్గ శ్రీనివాసశర్మ, ఆలయ పూజారి, అబాది రామగుండం

రూ.1.50 లక్షలు పట్టివేత



నగదు చూపుతున్న ఎస్ఐ సతీష్‌కుమార్

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.50 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆ మొత్తాన్ని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

రామాజీపేట శివారులో రూ.68 వేలు

రాయికల్: మండలంలోని రామాజీపేట శివారులో గురువారం సాయంత్రం ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి వద్ద రూ.68 వేలు పట్టుకున్నారు. సంబంధిత పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ఒబులాపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.80 వేలు

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ చెక్‌పోస్టు వద్ద గురువారం ఓ కారులో తరలిస్తున్న రూ.80 వేలను పట్టుకున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి కారులో నగదు తీసుకెళ్తూ పట్టుబడ్డాడని అన్నారు. సంబంధిత పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కుక్కల దాడిలో 11 మందికి గాయాలు

ధర్మపురి: కుక్కల దాడిలో 11 మందికి గాయపడ్డారు. ధర్మపురిలోని గంగపుత్ర కాలనీలో గురువారం కుక్కలు గుంపుగా సంచరించాయి. స్థానికులైన నాగుల సుధ, గరిగె రోషన్, కన్నారి వర్ష, ప్రణీష్ తదితరులపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన వర్ష, ప్రణీష్‌లను స్థానికులు అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగతావారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. కుక్కల బారినుంచి తమను కాపాడాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



ప్రదీప్తి (ఫైల్)

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని గెంట్యాల ప్రదీప్తి(18) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. ప్రదీప్తి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం కాలేజీలో హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించింది. ప్రదీప్తి హఠాన్మరణంతో ఆమె తల్లిదండ్రులు గెంట్యాల రేణుక-భూమేశ్‌లు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రదీప్తి మృతదేహాన్ని అంబులెన్స్‌లో సిరిసిల్లలోని స్వగృహానికి తరలించారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్న వయసులోనే ఇంజినీరింగ్ విద్యార్థిని గుండెపోటుతో మరణించడం సిరిసిల్లలో విషాదం నింపింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో కరీంనగర్ మున్సిఫ్ కోర్టు ఓ వ్యక్తికి జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 22 మందిని పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు పది రోజుల జైలు, రూ.2500 జరిమానా విధించగా మిగతా 21 మందికి రూ.32,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఏసీపీ పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం ఎంచుకున్న గల్ఫ్‌బాటలో అప్పుల పాలై, వాటిని తీర్చే దారిలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి, ఐదు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం పిట్ట రాజయ్య(55) అనే వ్యక్తి తనువు చాలించారు. ఈ సంఘటన చందుర్తి మండలం మల్యాల గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలకు చెందిన పిట్ట రాజయ్య ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కంపెనీలో పని లేక తిరిగి రెండు సంవత్సరాలకే స్వగ్రామానికి చేరుకున్నాడు. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీరక పోవడంతో వాటిని చెల్లించే స్తోమత లేక ఈనెల 11న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కాగా మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.